క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాహు-కేతు పూజలు



సకరికల్లు: మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల దోషాలు ఉన్న వారు రాహు-కేతువులను ప్రసన్నం చేసుకుంటే దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. శ్రావణమాసం, ఆదివారం కావడంతో రాహు-కేతు పూజలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దోష నివారణకు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వర్షాల కోసం బొడ్రాయికి జలాభిషేకం



క్రోసూరు: క్రోసూరులో రైతులు, ప్రజలు వర్షాలు బాగా కురవాలని కోరుకుంటూ గ్రామ బొడ్రాయికి కృష్ణా జలాలతో అభిషేకం చేశారు. గత రెండు రోజులుగా గ్రామోత్సవాలు నిర్వహిస్తూ ఆదివారం కృష్ణా జలాలతో అభిషేకం నిర్వహించారు. ట్రాక్టర్ల ద్వారా కృష్ణా నది నుంచి నీటిని తీసుకొచ్చి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చికెన్, మటన్ షాపులు మూసివేయటం జరిగింది.

గంజాయితో ప్రాణాలకు ముప్పు

ఎస్ఐ చల్లా సురేష్



నకరికల్లు: గంజాయితో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. గంజాయి వలన కలిగే అనర్థాలను వివరిస్తూ మండలంలోని నర్సింగపాడులో ఎస్సీ కాలనీవాసులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని నిల్వ చేసినా, సేవించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సేవిస్తే శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయన్నారు. గంజాయి లాంటి దుర్వ్యసనాలకు బానిసలై తప్పుడు ప్రవర్తనలకు లోనవుతున్నారని అన్నారు. సమాజంలో గంజాయిని నిర్మూలించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు



అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో ఆదివారం సహృదయ ఫౌండేషన్ అధ్యక్షుడు పట్టీల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 450 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో గుంటూరు విజయశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొని అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గణేష్ యూత్ కమిటీ అధ్యక్షుడు రౌతు రవీంద్రకుమార్, పులిపాటి వెంకట పవన్‌కుమార్, మురళి, గురుస్వామి, కోలా వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారం

పెదకూరపాడు: పరస 75 తాళ్లూరు ప్రాథమిక పరపతి సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి రత్నకుమార్, సభ్యులుగా బండి అప్పారావు, కల్లి సుందరరామిరెడ్డితో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ సహకార సంఘాలు బలోపేతం చేయడంతో పాటు రైతులకు విస్తృత సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జీవాలకు వ్యాధుల కాలం

- మందలో కుంటుతున్న గొర్రెను గుర్తించి వేరు చేయాలి
- కుంటినంత మాత్రాన గాలికుంటువ్యాధి కాదు
- వెంటనే వైద్యులను సంప్రదిస్తే మేలు



గొర్రెల గిట్టలను పరిశీలిస్తున్న వైద్యులు



పొలంలో ఉన్న గొర్రెల మంద

రాజుపాలెం: వర్షాకాలంలో గొర్రెల్లో ఎక్కువగా ఫుట్ రాట్(గిట్టల మధ్య పుండ్లు) వ్యాధి వస్తుంది. ఇది అంటు వ్యాధి. ఒక దాని నుంచి వేరొక దానికి వెంటనే సోకుతుంది. వ్యాధికి అనేక అంశాలు దోహదం చేసినప్పటికీ ప్రాథమికంగా బాక్టిరాయిడెస్ నోడోసెస్ అనే గ్రామ్-నెగిటివ్ అనరోబిక్ బ్యాక్టీరియా వలన వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా గొర్రెలకు మాత్రమే వస్తుంది. తక్కువ సంఖ్యలో మేకలకు కూడా వస్తుందని వైద్యులు చెబుతున్నారు. రెండు నెలలు, ఆ పైబడిన వయస్సు గల జీవాలలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. జీవాలలో తక్కువ కాలంలో వేగంగా వ్యాప్తి చెంది, ఆర్థిక నష్టాలను కలిగిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. రాజుపాలెం పశు వైద్యశాల పరిధిలో గొర్రెలు 6,500, మేకలు 2,500 ఉంటాయని వైద్యులు తెలిపారు.

వ్యాప్తి ఇలా...

ఫుట్‌రాట్ వాతావరణ పరిస్థితుల బట్టి జీవాలకు సంక్రమిస్తుంది. నిరంతర వేడి, తేమ, నీళ్లతో నిండిన పచ్చిక బైళ్లు, దీర్ఘకాలిక వర్షపు వాతావరణం, బురద మట్టిలో జీవాలు నడిచినప్పుడు, పొడవాటి గడ్డి ఉన్న పచ్చికబైళ్లలో జీవాలు నిలిచినప్పుడు జీవాల కాలిగిట్టల మధ్య గాయం ఏర్పడి, కాళ్లు మెత్తబడి పగుళ్లు ఏర్పడును. వాటి ద్వారా బ్యాక్టీరియా చేరి వ్యాధి వృద్ధి చెందుతుంది. ఫుట్‌రాట్ సోకిన గొర్రెల గిట్టల నుంచి స్రవించే ద్రవాలు నేలను తాకి, ఆ నేలమీద ఆరోగ్యకరమైన జీవాలు నడిచినప్పుడు వ్యాధి సోకుతుంది.

లక్షణాలు ఇలా...

ఫుట్‌రాట్ వ్యాధి సోకిన గొర్రెలు జీవాల మందలో కుంటుతూ కనిపిస్తుంటాయి. జీవాలు కుంటుతూ కనిపిస్తే గాలికుంటు వ్యాధి అనుకోకూడదని, గాలికుంటు వ్యాధి నోటికి, కాళ్లకు మాత్రమే వస్తుందని వైద్యులు తెలిపారు. కాలి గిట్టల మధ్య చర్మానికి మాత్రమే బ్యాక్టీరియా చేరడం వలన చర్మం కుళ్లి చెడు వాసన వస్తుంది. గిట్టల మధ్య చర్మం ఎర్రగా మారి మెత్తగా తయారవుతుంది. గిట్టలు పూడుకుపోవడం జరుగుతుంది. జ్వరం వచ్చి సరిగా మేత మేయవు. లేవలేని స్థితికి చేరుకుని, జీవాలు బరువు తగ్గడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటివి జరుగుతాయి.

వ్యాధి నిర్ధారణ.. చికిత్స

లక్షణాలను బట్టి గిట్టల మధ్య స్రవాలను స్వాబ్స్ ద్వారా సేకరించి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. ఫుట్‌రాట్ అని తేలితే జీవాలను మందలో కలపకుండా వేరు చేసి చికిత్స అందించాలి. వ్యాధి సోకిన జీవాలను బయట మేతకు వదలరాదు. కుళ్లిన గిట్టలను బాగా శుభ్రపరిచి యాంటీబయాటిక్ ద్రావణాలు, ఫుట్‌బాత్ వాడడం వలన నియంత్రించవచ్చు. ఈ ప్రక్రియను వారానికి ఒక్కసారి చేస్తే వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

పశు వైద్యులను సంప్రదించాలి



జీవాల కొనుగోలు సమయంలో గిట్టలను పరిశీలించి కొనుగోలు చేయాలి. సంత నుంచి కొనుగోలు చేసిన జీవాలను నాలుగు వారాల పాటు మందలో కలపకుండా బయట తిప్పాలి. ట్రిమ్మర్లను యాంటీబయాటిక్ ద్రావణంలో శుభ్రం చేసి గిట్టలను కత్తిరించాలి. వ్యాధి నిరోధక శక్తి పెరిగే మందులను వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. జీవాలు కుంటుతున్నట్లయితే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. నాటు వైద్యం చేయరాదు. దీని వలన వ్యాధి తగ్గకపోగా తీవ్రత పెరుగుతుంది.

– డాక్టర్ జి.వీరయ్య, ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులు, రాజుపాలెం

ఆటో దహనంపై కేసు నమోదు



దహనమైన టాటా మ్యాజిక్ ఆటో

సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల గ్రామంలో ఆటో దహనంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన మొక్కపాటి భూపతి తన అత్త అయిన అంజలి మోర్జంపాడు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. భర్త ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఆమెకు బెల్లంకొండ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బాణావత్ ఆంజనేయులునాయక్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఆమె ఆంజనేయులునాయక్‌కు రూ.1.50 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల ఆమెకు గ్యాస్ ప్రమాదంలో కాళ్లు కాలిపోవడంతో చికిత్స నిమిత్తం ఆమె ఇవ్వాల్సిన నగదు ఇవ్వమని కోరుతుండటంతో ఇదిగో అదిగో అంటూ ఆంజనేయులునాయక్ వాయిదా వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 25న ఆటో పంపించి డబ్బు ఇచ్చి తీసుకువెళ్లమని చెప్పగా ఆంజనేయులునాయక్ అందుకు అంగీకరించి డ్రైవర్ ద్వారా టాటా మ్యాజిక్ ఆటోను పంపించాడు. వారు ఆటోను రెంటపాళ్లకు తీసుకువచ్చారు. ఆంజనేయులునాయక్ శనివారం వచ్చి ఆటో ఎక్కడుందో చెప్పాలని, నగదు ఇచ్చి తీసుకువెళ్తానని చెప్పాడు. దీంతో ఆటోను చూసి వెళ్లిన ఆంజనేయులునాయక్ డబ్బు ఇవ్వకపోగా శనివారం అర్ధరాత్రి దహనం చేశాడని భూపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• బస్సు షెల్టర్ నిర్మించరూ..!



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల నరసరావుపేట బస్టాప్ పాయింట్‌లో బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గుంటూరు రోడ్‌లో బస్సులు ఆగే పాయింట్‌లో విశాలమైన స్థలం ఉన్నప్పటికీ పండ్ల వ్యాపారుల దుకాణాలను తొలగించి మరీ అక్కడ బస్సు షెల్టర్ నిర్మాణానికి పాలకులు సన్నాహాలు చేస్తున్నారు. కానీ నరసరావుపేట బస్టాప్ పాయింట్‌లో కనీసం రాకపోకలకు కూడా స్థలం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి నరసరావుపేట బస్టాప్ పాయింట్‌లో కూడా బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సత్తెనపల్లి

• ఈ భవనాన్ని కూల్చరూ...



ప్రమాదకరంగా ఉన్న పాత బాలికల వసతి గృహం

పెదకూరపాడులోని పాత బాలికల వసతి గృహం అసాంఘిక కార్యకలాపాలకు, విష పురుగులు, సర్పాలకు నిలయంగా మారింది. వసతి గృహం శిథిలావస్తకు చేరడంతో పది ఏళ్ల క్రితం ఇక్కడ వసతి గృహాన్ని తీసివేశారు. అప్పటి నుంచి వసతి గృహంలో పిచ్చి చెట్లు మొలిచి విష పురుగులు, పాములకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో కొండచిలువలు కూడా తిరుగుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో అటు వైపు వెళ్లాలంటేనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పగటిపూట స్థానిక యువకులు పేకాట, మద్యం సేవించే స్థావరంగా మార్చుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ భవనాన్ని కూల్చివేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు

నిస్వార్థంగా పని చేసే నాయకులను ఎన్నుకోవాలి



ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులతో జంగాల శ్రీనివాసరావు, చిలకా జాన్సన్ తదితరులు

సత్తెనపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల్లో నిస్వార్థంగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం సత్తెనపల్లి వచ్చిన ఆయనను లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అద్దంకి బాబు మాదిగ మాట్లాడుతూ గ్రామగ్రామాన జెండా దిమ్మెలను నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనతో పాటు కొడవటి అశోక్ మాదిగ, ఉపాధ్యక్షుడు కందుకూరు రమేష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి సత్య మాదిగలను లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్ నాయకులు జంగాల శ్రీనివాసరావు, ఎంఈఎఫ్ సీనియర్ చిలకా జాన్సన్ మాదిగలు కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్, ఎంఈఎఫ్ నాయకులు తదితరులు ఉన్నారు.

జెండా దిమ్మెల నిర్మాణం వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదకూరపాడు: మండల ఎమ్మార్పీఎస్ సమావేశం పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్ బాబు మాదిగ అధ్యక్షతన పెదకూరపాడులో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఇన్‌చార్జులు ఎంఎస్‌పీ ఉపాధ్యక్షుడు మాతంగి సత్యానందం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొడవటి అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మహిళా, విద్యార్థి, ఉద్యోగుల కమిటీలు వేయాలని, గ్రామంలో జెండా దిమ్మెల నిర్మాణం వేగవంతం చేయాలని, కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• విస్తారంగా వర్షాలు.. రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



మల్లాది వద్ద వర్షాలకు తెప్పరిల్లిన పత్తి పైరు

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులలో పత్తి పంటపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ వర్షాల వల్ల వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎరువులు వేసి పత్తి పంటలో అంతరకృషి చేస్తుండటంతో పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరుగుతుండటంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా వర్షాధార పంటలు పండిస్తుండటంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడలిన పత్తి మొక్కలు తెప్పరిల్లాయి. మండలంలో పత్తి పంట సుమారు 12 వేల ఎకరాలలో సాగు చేయగా, మిర్చి పంట 2,000 ఎకరాలలో సాగు చేసే అవకాశం ఉందని, వరి 200 ఎకరాలు, కూరగాయలు, ఇతరాలు 3,000 ఎకరాలలో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పది రోజులకు ముందు వర్షాలు పడక డీలా పడ్డ రైతులు ప్రస్తుతం వ్యవసాయ పనులలో వేగం పెంచారు.

యువతలో విజయకాంక్షను రగిలించిన కలాం

- మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావునాయక్
- సత్తెనపల్లిలో వాడవాడలా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్వామి వివేకానంద చైతన్యభారతి బాధ్యులు

సత్తెనపల్లి: దేశ యువతలో విజయకాంక్షను రగిలించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం భౌతికంగా మరణించినప్పటికీ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని కలాం విగ్రహం వద్ద ఆదివారం కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రమావత్ కోటేశ్వరరావునాయక్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన కలాం ఎంతో నిరాడంబరంగా జీవించారన్నారు. ఆయన ఆదర్శాలు, ఆశయాలను నేటితరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. భారతరత్న అవార్డుకు ఆయన ప్రతిరూపంగా నిలిచారన్నారు. మిస్సైల్ మేన్ ఆఫ్ ది ఇండియాగా పేరొందిన కలాం ఈ దేశంలో జన్మించడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్యుత శివప్రసాద్, లోక మాధవ, గద్దం వెంకటేశ్వర్లు, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), సయ్యద్ ఘోర, యాసారపు బాబు, షేక్ నాగుల్‌భాష, షేక్ జానీ, గుజ్జర్లపూడి కృపావరం, సిరిగిరి వెంకట్రావు, వల్లెం నరసింహారావు, విప్పర్ల కొండలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో...

దివంగత భారత రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహుడు, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నిర్వహించారు. స్వామి వివేకానంద చైతన్య భారతి ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం నిర్వహించిన అణు పరీక్షలు, నిరాడంబరమైన జీవిత విశేషాలను వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జేపీఎస్ శాస్త్రి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష పరిజ్ఞానంలో నేటి మన దేశ ప్రగతికి అబ్దుల్ కలాం కృషే పునాది అన్నారు. ముందుగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొల్లిపర కాశీ విశ్వనాథం, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు దేవరశెట్టి రవికుమార్, మాధంశెట్టి వేదాద్రి, ఎంవీ సుబ్బారెడ్డి, మురళి, అన్నం కృష్ణ, కటకం కృష్ణ, పోతుగంటి రామకోటేశ్వరరావు, అబ్బూరి సత్యనారాయణ, కిషోర్, కాపుగంటి రత్తయ్య, వెంకట నారాయణ, ఏడుకొండలు, మక్కెన కోటేశ్వరరావు, చాంద్, రాఘవ, హసన్‌బుడే, నరసింహారావు, సైదారావు, వీరాంజనేయులు, సాంబశివరావు, వల్లెం లక్ష్మీ చెన్నకేశవ పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

రొంపిచర్ల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం స్కందన్ ఐ హస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన మందులు అందజేశారు. డాక్టర్ పనేందర్ రెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్‌లు అవసరమైన వారికి నరసరావుపేటలోని స్కందన్ నేత్రాలయంలో ఆపరేషన్‌లు చేస్తామన్నారు. పల్లపు శివారెడ్డి, పడాల చక్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ అధ్యక్షుడు ప్రమాణస్వీకారం

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ నూతన అధ్యక్షుడు గడుపూడి విశ్వనాథం, డైరెక్టర్లు బండారు వీరాంజినేయులు, గోనుగుంట్ల నాగరాజుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు ఆదివారం తెలిపారు. సొసైటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం ప్రారంభోత్సవం కూడా జరుగుతుందన్నారు.

ఆగస్ట్ 13 నుంచి త్రిశక్తి దుర్గా పీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య స్కూల్ దగ్గర వేంచేసియున్న త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్ట్ 13 నుంచి ప్రారంభమవుతాయని పీఠాధిపతులు వెలిదండ్ల హనుమత్ స్వామి ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్లకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, దశవిధ అభిషేకాలు జరుగుతాయన్నారు. పురోహితుడు కలవకొలను సీతారామ శాస్త్రి (రాము) ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

దమ్మాలపాడులో ఉచిత వైద్య శిబిరం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామం రామాపురం కాలనీలో నరసరావుపేటకు చెందిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బి.వెంకట్రావు, సీహెచ్ కృష్ణచైతన్యలు పాల్గొని వైద్య సేవలు అందించారు. మొత్తం 185 మందికి బీపీ, షుగర్, మూత్ర, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంపై అవగాహన సదస్సు



నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని టైని టాట్స్, కిండర్ జాయ్ స్కూల్‌లో నరసరావుపేట, నకరికల్లు, రొంపిచర్ల మండలాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులకు గణిత అవగాహన సదస్సు పట్టణంలోని టైని టాట్స్, కిండర్ జాయ్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విజయవాడకు చెందిన ప్రముఖ గణిత అధ్యాపకులు డాక్టర్ ఎస్.లెనిన్‌బాబు పాల్గొని గణితంపై ఆసక్తి కలిగేలా విద్యార్థులకు గణిత సమస్యలు అత్యద్భుతంగా వివరించారు. ముఖ్యంగా బీజగణితం, నెంబర్ థియరీ, త్రికోణమితి, కలనగణితంలోని అంశాలను విపులంగా వివరించారు. పోటీపరీక్షలకు గణితంలోని అంశాలు, కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సదస్సుకు జడ్పీహెచ్ఎస్ కండ్లకుంటకు చెందిన మాథ్స్ టీచర్ చాంద్‌బాషా అధ్యక్షత వహించారు. సుమారు 30 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని గణిత అభ్యాసం చేశారు. లెనిన్ బాబును పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్ అభినందించారు. భాగేశ్వరి, షేక్ చాంద్‌బాబు, మద్దుకూరి మోహన్ సమన్వయం చేశారు. విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, కోశాధికారి కోయ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.